

భూనిర్వాసితులకు నోటీసులు

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట పరిధిలో ఎన్‌హెచ్ 63 రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు యాసంగి పంటలు సాగు చేయవద్దని అధికారులు నోటీసులు జారీ చేశారు.



ఆలయాల్లో విప్ పూజలు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి, శ్రీరామలింగేశ్వరస్వామి వారలను శుక్రవారం విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దర్శించుకున్నారు. అర్చకులు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0/23.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది. రాత్రి చలిగాలులు వీచే అవకాశముంది.

న్యూస్‌రీల్

వేంకటేశ్వరస్వామికి క్షీరాభిషేకం



ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీవేంకటేశ్వర ఆలయంలో శుక్రవారం స్వామివారికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారిని పూలతో అలంకరించారు. అర్చకుడు శ్రీనివాసచార్యులు ప్రత్యేక పూజలు చేసి ఆలయ ప్రాంగణంలో లక్ష్మీహవన కార్యక్రమం నిర్వహించారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి



సబ్ జడ్జి వెంకట మల్లిక్ సుబ్రహ్మణ్య శర్మను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

జగిత్యాలజోన్: కోర్టుల్లో పెరిగిపోతున్న పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా మొదటి అదనపు జడ్జి సుగళి నారాయణ అన్నారు. జగిత్యాల సబ్ కోర్టు జడ్జిగా నియమితులైన వెంకట మల్లిక్ సుబ్రహ్మణ్య శర్మకు శుక్రవారం బార్ అసోసియేషన్ సభ్యులు స్వాగత కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా మొదటి అదనపు పాల్గొని మాట్లాడారు. కక్షిదారులకు సత్వర న్యా యం అందించేందుకు న్యాయమూర్తులు, న్యాయవాదులు కలిసి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కోర్టుల్లో సిబ్బంది తక్కువగా ఉన్నప్పటికీ కేసులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు జడ్జిలు సిద్ధంగా ఉన్నారన్నారు. నూతనంగా నియమి తులైన సబ్ జడ్జి వెంకట మల్లిక్ సుబ్రహ్మణ్య శర్మ మాట్లాడుతూ, కేసుల సత్వర పరిష్కారం కోసం అ ధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీ నిజ, మొదటి అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ జితేందర్, రెండో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ వినిల్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డబ్బు లక్ష్మారెడ్డి, భూమి రమణ పాల్గొన్నారు.

జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శిగా ప్రసాద్



ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న న్యాయవాదులు

జగిత్యాలజోన్: జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శిగా కంచ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించగా, శుక్రవారం జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ, జిల్లా ప్రజలకు చట్టాలపై, పెరుగుతున్న మోసాలపై అవగాహన కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. వివిధ కోర్టుల్లో న్యాయవాదులను పెట్టుకునే స్తోమత లేనివారికి ఉచితంగా న్యాయవాదులను నియమిస్తామని పేర్కొన్నారు. జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ చీఫ్ కటుకం చంద్రమోహన్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ చీఫ్ పొట్టవత్తిని సతీశ్, విజయకుమార్ పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలని వినతి



అదనపు కలెక్టర్ రాంబాబుకు వినతిపత్రం ఇస్తున్న బీసీ నాయకులు

జగిత్యాలటౌన్: పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం అదనపు కలెక్టర్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డిగ్రీ, పీజీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సకాలంలో స్కాలర్‌షిప్‌లు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం విద్యార్థులను దగా చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం పేద, మధ్య తరగతి విద్యార్థులకు న్యాయం చేసేలా పెండింగ్‌లో ఉన్న రూ.750 కోట్ల ఫీజు బకాయిలను విడుదల చేయాలని కోరారు. లేకుంటే సెక్రటేరియేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. నాయకులు తిరుపురం రాంచందర్, బండపెల్లి మల్లేశ్వరి, హృషికేశ్, ముద్దం గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

ఇదేం లెక్క..!



'ఈమె పేరు జాన నల్లగొండ. కోరుట్ల మండలం మోహన్‌రావుపేట గ్రామం. ఈమె భూమి నుంచి బైపాస్ రోడ్డు వెళ్తుంది. సదరు భూమిలో బర్ల కోసం వేసిన షెడ్డు ఉంది. షెడ్డు కొలతల కోసం ఆర్‌అండ్‌బీ అధికారులు శుక్రవారం వచ్చారు. నాలుగు గుంటల్లో ఉన్న షెడ్డు కొలతలు పది నిమిషాల్లో పూర్తి చేశారు. కాగా అధికారులు ముందుగా చెప్పకుండా వచ్చి తాము ఎంత చెప్పినా రేకుల షెడ్డును రికార్డు చేయలేమన్న రీతిలో మాట్లాడారని, మీరే షెడ్డు తీసేసుకోవాలని చెబుతున్నారని వాపోయింది. ఇవేమి లెక్కలని, తనకు సరైన న్యాయం చేయాలని కోరింది.

- హడావుడిగా బైపాస్ భూ సేకరణ కొలతలు.. లెక్కలు
- పరిహారం నిక్కచ్చిగా అందేనా..?
- ఎన్‌హెచ్ బైపాస్ బాధితుల్లో సందేహాలు



కోరుట్ల మండలం మోహన్‌రావుపేటలో ఎన్‌హెచ్ బైపాస్ కిందకు వచ్చిన రేకుల షెడ్డు

కోరుట్ల: జాతీయ రహదారి బైపాస్ రోడ్డు నష్టపరిహారం వ్యవహారం బాధితుల్లో కలవరం రేపుతోంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వెళ్తున్న బైపాస్‌రోడ్డులో నష్టపోతున్న భూమికి సర్కార్ రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం పట్టణాల్లో రెండింతలు, గ్రామీణ ప్రాంతాల్లో మూడింతల నష్టపరిహారం వస్తుంది. బైపాస్‌లో రైతులు నష్టపోతున్న భూముల్లో ఉన్న వనరుల విలువ లెక్కతీసే కార్యక్రమంలో వివిధ శాఖల అధికార యంత్రాంగం నిమగ్నమైంది. ఈ లెక్కల తంతు హడావుడిగా సాగుతుండటంతో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బండలింగాపూర్ టు రాయపట్నం

జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండలం బండలింగాపూర్ నుంచి మెట్‌పల్లి, కోరుట్ల, మేడిపల్లి, జగిత్యాల, బుగ్గారం మండలాల్లోని గ్రామాల మీదుగా ధర్మపురి మండలం తిమ్మాపూర్ నుంచి రాయపట్నం వరకు బైపాస్ రోడ్డు విస్తరించి ఉంది. జిల్లాలో సుమారు 52 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి బైపాస్‌రోడ్డు కోసం భూసేకరణ ప్రతిపాదనలు చేశారు. బైపాస్‌లో నష్టపోయే బాధితులకు చెల్లించే పరిహారం కోసం నేషనల్ హైవే అథారిటీ నుంచి ఒక్కో కిలోమీటరుకు రూ.140 కోట్లు కేటాయించినట్లు సమాచారం. ఇప్పటికే భూసేకరణ పూర్తి కాగా ప్రస్తుతం ఆయా భూముల్లో ఉన్న వనరుల విలువ లెక్కవేస్తున్నారు. కాగా వనరుల లెక్కింపు హడావుడిగా పూర్తి చేస్తే బాధితులకు నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వనరుల విలువ లెక్కింపు ఇలా..

బైపాస్‌లో నష్టపోతున్న భూముల్లోని వనరుల కింద మామిడి, తాటి, ఈత, టేకు చెట్లు, వ్యవసాయ బావులు, ఇండ్లు, రేకుల షెడ్లు, బోర్లు ఇతరత్రా అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. మామిడి, జామ, గులాబీ వంటి ఉద్యానవన శాఖకు చెందిన వాటి విలువను ఆ శాఖ వారు నిర్ధారిస్తారు. తాటి, ఈత చెట్ల వయసు, కల్లు వస్తున్న తీరును బట్టి ఎక్సైజ్ అధికారులు వాటి విలువ లెక్కిస్తారు. వ్యవసాయబావుల, బోర్ల విలువ అగ్రికల్చర్, పంచాయతీరాజ్ అధికారులు, ఇండ్లు, రేకుల షెడ్లు, బోర్లు, పైప్‌లైన్లు వంటి అంశాల విలువను ఆర్‌అండ్‌బీ అధికారులు లెక్కిస్తారు. ఇలా వివిధ డిపార్ట్‌మెంట్లవారీగా బైపాస్‌లో నష్టపోతున్న భూముల్లో ఉన్న వనరుల లెక్కతేల్చి అధికారులకు నివేదిస్తారు. ప్రస్తుతం ఈ పనిలో వివిధ శాఖలు నిమగ్నమయ్యాయి.

నష్టం జరగనివ్వం

బైపాస్‌లో నష్టపోతున్న భూముల్లోని వనరుల విలువల లెక్కింపు నిక్కచ్చిగా జరుగుతుంది. ఎలాంటి హడావుడికి చోటు లేదు. ఆయా శాఖల అధికారులు పక్కాగా వనరులను గుర్తించి వాటి విలువ లెక్కించాల్సి ఉంటుంది. ఈ విషయంలో ఏలాంటి సందేహాలకు తావులేదు.

– శ్రీనివాస్, ఆర్డీవో, మెట్‌పల్లి

హడావుడి తంతు..?

బైపాస్ రోడ్డు నష్టపరిహారం వ్యవహారంలో వనరుల లెక్కతీయాల్సిన అధికారులు హడావుడి పడటం బాధితులను కలవరపెడుతోంది. శుక్రవారం మోహన్‌రావుపేటలో షెడ్డు కోల్పోతున్న వారికి మాజీ సర్పంచ్ ద్వారా పది నిమిషాల ముందు సమాచారం ఇచ్చి వెంటనే రావాలని ఆర్‌అండ్‌బీ అధికారులు కోరడం గమనార్హం. కీలకమైన ఇండ్లు, షెడ్లు వంటి వాటి కొలతలు నిర్ధారించి విలువ గట్టాల్సిన అధికారుల తీరే ఇలా ఉంటే చెట్లు, బావులు, బోర్ల లెక్క కట్టాల్సిన అధికారులు ఎంత హడావుడిగా చెప్పాపెట్టకుండా పనులు పూర్తి చేస్తున్నారో..అన్న ఆందోళన బాధితుల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా బాధితులకు నష్టం జరగకుండా వనరుల విలువ నిక్కచ్చిగా లెక్కతీయాల్సిన అవసరం ఉంది. ఇదివరకు తీసుకున్న గూగుల్ మ్యాప్‌లు, వాటిలో కనిపిస్తున్న వనరులను సరైన రీతిలో గుర్తించి లెక్కతీయాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

చెట్ల లెక్కింపు త్వరగా పూర్తి చేయండి



చెట్ల లెక్కింపు వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ సత్యప్రసాద్

- కలెక్టర్ సత్యప్రసాద్

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ రోళ్లవాగు ప్రాజెక్టులో ముంపునకు గురైన అటవీభూముల్లోని చెట్ల లెక్కింపును సత్వరం పూర్తి చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం చెట్ల లెక్కింపు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రూ.136.81 కోట్ల వ్యయంతో రోళ్లవాగు ఆధునీకరణ ద్వారా నీటి నిల్వ సామర్థ్యం 0.25 టీఎంసీ నుంచి 0.949 టీఎంసీకి చేరుతుందని, ప్రాజెక్టు పనులు దాదాపు పూర్తికావచ్చాయని పేర్కొన్నారు. అటవీశాఖకు చెందిన 900 ఎకరాలు ముంపునకు గురికాగా, జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రెవెన్యూ భూములు కేటాయించడం జరిగిందన్నారు. చెట్ల లెక్కింపులో జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై డీఈ చక్రూనాయక్ సమాధానమిస్తూ ఇప్పటి వరకు 6 కంపార్టుమెంట్‌ల్లో 31,483 చెట్లను లెక్కించినట్లు తెలిపారు.

నాణ్యమైన విద్యనందించాలి

పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. బీర్‌పూర్ జెడ్పీ పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల స్థితిగతుల గురించి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల సమయపాలనపై ఆరా తీసి, రిజిస్టర్లు పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని విద్యార్థులు, వారి తల్లితండ్రులు గుర్తించాలన్నారు. పదో తరగతిలో వందశాతం ఫలితాలు వచ్చేలా కృషి చేస్తూనే, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెట్టి, వారు సైతం మెరుగైన ఫలితం సాధించేలా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమాల్లో డీఎఫ్‌వో రవిప్రసాద్, ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ ముంతాజిబొద్దీన్, ఎంఈవో సిరుప నాగభూషణం, ఆర్‌ఐ శ్రీనివాస్, ఎంపీవో ఏవీకే రాజు తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటేందుకు శిక్షణ తరగతులు

- డీఐఈవో వెంకటేశ్వర్లు



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఐఈవో వెంకటేశ్వర్లు

మల్లాపూర్(కోరుట్ల): ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులు పోటీ పరీక్షల్లో ప్రతిభచాటేందుకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి (డీఐఈవో) వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం మల్లాపూర్ ప్రభు త్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశా రు. కళాశాల రికార్డులు, విద్యార్థులు, అధ్యాపకుల హాజరుశాతం పరిశీలించారు. మౌలిక వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఇంటర్ దశలోనే విద్యార్థులు గమ్యం చేరేవరకు పట్టుదలగా కృషి చేయాలన్నారు. ప్రిన్సిపాల్ బండి సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

విలువలతోకూడిన విద్యనందించాలి

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందించాలని డీఐఈవో వెంకటేశ్వర్లు అన్నారు. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. అధ్యాపకులు చెప్పే పాఠాలను విద్యార్థులు క్షుణ్ణంగా విని పరీక్షల్లో మంచి మార్కులను సాధించాలని కోరారు. మానసిక ప్రశాంతత కోసం రోజూ 20 నిమిషాల పాటు ధ్యానం చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ సంజీవ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జగిత్యాల రాజకీయం వ్యభిచారంగా మారింది

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



మాట్లాడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల: జగిత్యాల రాజకీయం వ్యభిచారంగా మారిందని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా శాంతి, అభివృద్ధికి మారుపేరని, వైద్య వృత్తిలో ఉన్న సంజయ్‌కుమార్‌కు కేసీఆర్ మూడుసార్లు అవకాశం కల్పించి గెలిపిస్తే.. అభివృద్ధి, నిధులు, నీళ్ల కోసం పార్టీ మారినట్లు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్‌కు రాజీనామా చేయలేదు, కాంగ్రెస్ సభ్యత్వం తీసుకోలేదని చెప్పడం అంటే తాళి కట్టలే.. సంసారం చేస్తున్నట్లుందని ఎద్దేవా చేశారు. జీవన్‌రెడ్డి అంటే అందరికీ గౌరవం ఉందని, ఏ సమస్య గురించైనా అసెంబ్లీలో మాట్లాడే జీవన్‌రెడ్డి.. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పార్టీ ఫిరాయింపుపై కూడా స్పీకర్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కేసీఆర్ హయాంలో శాంతియుతంగా ఉన్న రాజకీయాలు ఇప్పుడు హత్య రాజకీయాలుగా మారాయన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన సంజయ్‌కుమార్ సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరి కండువా కప్పుకోలేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. హత్య రాజకీయాలను ఖండిస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు గట్టు సతీశ్, హరిచరణ్‌రావు, బాపురెడ్డి, శివకేసరిబాబు, శీలం ప్రియాంక పాల్గొన్నారు.

డబ్బులడిగితే చెంపదెబ్బతో సమాధానం చెప్పండి

మెట్‌పల్లిరూరల్ (కోరుట్ల): కల్యాణలక్ష్మీ చెక్కుల మంజూరుకు ఎవరైనా డబ్బులడిగితే వారికి చెంపదెబ్బలతోనే సమాధానం చెప్పాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. శుక్రవారం మండలంలోని వెల్లుల వీఆర్ఎం గార్డెన్‌లో కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. పథకాల మంజూరుకు గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఎవరైనా డబ్బులడిగితే చెంప దెబ్బ వేసే మాట్లాడాన్నారు. ఏ సమస్యలున్నా నేరుగా తనకు తెలియజేయాలని, వాటి పరిష్కారానికి ముందుంటానని భరోసానిచ్చారు. హామీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందన్నారు. బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఏజెంట్, మధ్యవర్తి



సాక్షి ఎఫెక్ట్..

జగిత్యాలక్రైం: ఉద్యోగాల పేరిట నకిలీ ఏజెంట్లు తెలంగాణకు చెందిన పలువురిని లావోస్ పంపిస్తూ అక్కడ సైబర్‌క్రైం నేరాలు చేసేందుకు దింపుతున్నారు. ఈనేపథ్యంలో 'సాక్షి'లో ఈనెల 24న 'లావోస్ సైబర్‌క్రైంలో జగిత్యాలవాసులు'.. 25న 'డాటా ఎంట్రీ పేరుతో ఏజెంట్ల మోసం' శీర్షికన కథనాలు ప్రచురితం కావడంతో రాష్ట్ర సైబర్‌క్రైం పోలీసులు స్పందించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ అధికారులు శుక్రవారం జగిత్యాలకు చెందిన ఏజెంట్, మధ్యవర్తిని అదుపులోకి తీసుకుని హైదరాబాద్ తరలించారు. దీంతో సమాచారం చేరవేస్తున్నారని లావోస్‌లోని గోల్డెన్ ట్రయాంగిల్ సిటీలో అన్ని సైబర్ కంపెనీల యజమానులు శుక్రవారం వారి ఉద్యోగులను హెచ్చరించినట్లు ప్రత్యక్ష సాక్ష్యులు ఫోన్ ద్వారా తెలిపారు. సైబర్ సెక్యూరిటీ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపడితే అసలు విషయలు వెలుగుచూడటంతో పాటు, తెలంగాణకు చెందినవారు లావోస్‌లో ఎంత మంది సైబర్‌క్రైం ఉచ్చులో ఉన్నారనేది తేలనుంది.

డిసెంబర్‌లోపు డబుల్ బెడ్రూం ఇళ్లు పూర్తి చేయాలి

జగిత్యాల: డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు డిసెంబర్ లోపు పూర్తి చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం నూకపల్లిలోని డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. డ్రెయినేజీలు, సెప్టిక్‌ట్యాంక్‌ల నిర్మాణం, నీటి వసతి, విద్యుత్ సౌకర్యం, రోడ్డు పనులను పరిశీలించారు. నాణ్యతతో పనులు చేయాలని సూచించారు. ఆర్డీవో శ్రీనివాస్, పీఆర్ రహమాన్, అశోక్‌రెడ్డి, హౌసింగ్ డీఈ రాజేశ్వర్ పాల్గొన్నారు.

చదువుతో ఏదైనా సాధ్యం

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: చదువుతో ఏదైనా సాధ్యమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గొల్లపల్లిరోడ్‌లో గల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ మహిళ డిగ్రీ కళాశాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు గొప్ప లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని సాధించేందుకు కృషి చేయాలన్నారు. జగిత్యాల ప్రాంత విద్యార్థినులకు విద్య అందుబాటులో ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో 240 సీట్లతో కళాశాల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జగిత్యాల అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరానని, ఆదిపత్యం కోసం కాదన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, కౌన్సిలర్లు పవన్, రాజేశ్, ప్రిన్సిపాల్ శ్రీలత, నాయకులు పాల్గొన్నారు.

పాడిరంగాన్ని మెరుగుపర్చేందుకే పశుగణన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, రైతులు

మెట్‌పల్లిరూరల్: పాడిరంగాన్ని మెరుగుపర్చడానికి అవసరమయ్యే నిధులు, పథకాల రూపకల్పన, అమలు, పర్యవేక్షణకు పశుగణన ఎంతో ఉపయోగపడుతోందని పశువైద్య, సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నరేశ్ అన్నారు. శుక్రవారం మెట్‌పల్లి మండలం చింతలపేటలో 21వ పశుగణన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాడిరైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. అలాగే మెట్‌పల్లి మండల పశువైద్యాధికారి కొమ్మెర మనీషా ఆధ్వర్యంలో పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. సిబ్బంది రమ, రమణయ్య, చిరంజన్, మోహన్, దిలీప్, పాడిరైతులు పాల్గొన్నారు.

కేటీఆర్.. నోరు అదుపులో పెట్టుకో

- ప్రభుత్వ విప్‌లు అడ్లూరి, ఆది



మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుష్పలతను సన్మానిస్తున్న విప్‌లు అడ్లూరి లక్ష్మణ్, ఆది శ్రీనివాస్

మల్లాపూర్(కోరుట్ల): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలని ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేఎంఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన నూతన మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 27 రోజుల్లోనే హామీ మేరకు రూ.2లక్షల రుణమాఫీ అమలు చేసిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందని దుయ్యబట్టారు. టెక్నికల్ సమస్యలపై బీఆర్ఎస్, బీజేపీలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని మండిపడ్డారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధిచెప్పినా కేటీఆర్, హరీశ్‌రావు అహంకారం తగ్గలేదని, సీఎం రేవంత్‌రెడ్డిని ఇష్టారీతిన దుర్భాషలాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. నోరు అదుపులో పెట్టుకోకుంటే కాంగ్రెస్ కార్యకర్తలు తగిన బుద్ధిచెబుతారని హెచ్చరించారు. మార్కెట్ కమిటీ బలోపేతానికి చైర్‌పర్సన్ పుష్పలత, వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, సభ్యులు కృషి చేయాలని సూచించారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు. కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లుగా పారిశుద్ధ్య కార్మికులు

- జగిత్యాల బల్దియాలో 17 మంది నియామకం
- వెల్లువెత్తుతున్న ఆరోపణలు

జగిత్యాల: జగిత్యాల మున్సిపాల్టీలో ప్రస్తుతం పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న దాదాపు 17 మందిని డ్రైవర్లుగా నియమిస్తూ వారికి జీతభత్యాలు పెంచాలని కౌన్సిల్ ఎజెండాలో పొందుపర్చారు. పారిశుద్ధ్య కార్మికుల జీతం రూ.15,600, డ్రైవర్లకు రూ.19,500 ఉంటుంది. కాగా సదరు నియామకాలపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జగిత్యాల జిల్లా కేంద్రంగా ఏర్పడిన సమయంలో అప్పటి కలెక్టర్ నేరుగా మున్సిపల్‌కు కావాల్సిన డ్రైవర్లను నోటిఫికేషన్ ద్వారా నియమించారు. ప్రస్తుతం లైసెన్స్, బ్యాడ్జీలు కలిగిన పారిశుద్ధ్య కార్మికులను నియమించారు. ఇప్పటికే పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య తక్కువగా ఉంది. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారుల ఇళ్లలో అత్యధికంగా మున్సిపల్ కార్మికులు పనిచేస్తుంటారు. ఇది చాలక కార్మికులుగా పనిచేస్తున్న వారినే డ్రైవర్లుగా నియమించారు. సీడీఎంఏ నిబంధనల ప్రకారం ప్రస్తుతం ఉన్న కార్మికులనే డ్రైవర్లుగా, ఇతరత్ర పనులకు వినియోగించుకోవాలని నిబంధనలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఆరోపణల వెల్లువ

జగిత్యాల మున్సిపల్‌లో గతంలో కూడా పారిశుద్ధ్య కార్మికులనే దాదాపు 10 మందికి పైగా డ్రైవర్లుగా నియమించారు. తాజాగా 17 మందిని నియమించగా ఇటీవల వారికి బాధ్యతలు ఇచ్చారు. కానీ ఇందులో అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది. కార్మికుల ఒక నెల జీతం ఇస్తేనే డ్రైవర్‌గా నియమిస్తామన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బల్దియాలో 12 ట్రాక్టర్లు, ఒక జేసీబీ, ఒక బ్లేడ్ ట్రాక్టర్, ఒక టిప్పర్ ఉంది. వీటికి హెవీ లైసెన్స్ డ్రైవర్లు కావాలి. 48 ఆటోలు ఉన్నా హెవీ లైసెన్స్ డ్రైవర్లు అవసరం ఉండదు. కాగా ప్రస్తుతం నియామకమైనవారిలో కొందరికి బ్యాడ్జీలు, లైసెన్స్ లేనట్లు తెలిసింది.



జగిత్యాల మున్సిపాలిటీ

శానిటేషన్ ఎలా..?

జిల్లా కేంద్రంలో ఇప్పటికే శానిటేషన్ అస్తవ్యస్తంగా మారింది. పట్టణంలో 48 వార్డులు ఉండగా, 1.28 లక్షలకు పైగా జనాభా ఉంది. 262 మంది అవుట్ సోర్సింగ్, 20 మందికి పైగా పర్మినెంట్ ఉద్యోగులున్నారు. వీరే శానిటేషన్ పనులు చేస్తుంటారు. కాగా పారిశుద్ధ్య కార్మికులను డ్రైవర్లుగా నియమిస్తూ వారికి జీతం పెంచడం సమస్య కాదని, కానీ వారి నెల జీతం ఇస్తేనే నియమిస్తురన్న విషయం బల్దియాలో చర్చనీయాంశంగా మారింది.

దృష్టికి వస్తే చర్యలు



సీడీఎంఏ నిబంధనల ప్రకారం ఉన్న కార్మికులను డ్రైవర్లుగా, ఇతరత్ర పనులకు నియమించుకోవాలి. వారి వద్ద డబ్బు తీసుకున్నట్లు మా దృష్టికి రాలేదు. వస్తే చర్యలు తీసుకుంటాం. నియామకాల్లో అవకతవకలు జరగలేదు.

– చిరంజీవి, మున్సిపల్ కమిషనర్, జగిత్యాల

క్లుప్తంగా

నిరుపేద విద్యార్థులకు ఫీజుల్లో రాయితీ

- అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి



కరీంనగర్: తన విద్యాసంస్థల్లో నిరుపేద విద్యార్థులకు ఫీజుల్లో రాయితీ, వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం కరీంనగర్ మండలంలోని పలు విద్యాసంస్థల్లో ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. పట్టభద్రుల ఎన్నికల్లో తనకు మద్దతు తెలపాలని కోరారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు విద్యారంగ సమస్యలపై అవగాహన ఉన్న తనను పట్టభద్రులు ,ఉపాధ్యాయులు నిరుద్యోగులు భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నవంబర్ 6లోపు ప్రతీఒక్కరు ఓటును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. తనకు అవకాశం ఇస్తే నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు పారమిత విద్యార్థి



కరీంనగర్: నగరంలోని పారమిత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న భువనకృతి రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్ పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాజీ తెలిపారు. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి సెమినార్‌లో భువనకృతి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాటెన్షియల్స్ అండ్ కన్సరన్స్ అంశంపై ఇచ్చిన సెమినార్ మొదటిస్థానం సాధించింది. ఈనెల 29న రాష్ట్రీయ విద్యా పరిశోధన శిక్షణ సంస్థవారి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికైంది. విద్యార్థిని పారమిత పాఠశాల అధినేత ఇనుగంటి ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, రాకేశ్, రశ్మిత, అనుకర్ రావు అభినందించారు.

హనుమాన్ ఆలయంలో చోరీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బండలింగంపల్లిలో గల శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం రాత్రి గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయానికి సాయంత్రం తాళం వేసి వెళ్లిన పూజారి శుక్రవారం తెల్లవారుజామున వచ్చి చూసేసరికి ఆలయం తలుపులు పగులగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా ఆలయంలోని హుండీని ధ్వంసం చేసి అందులోని సుమారు రూ.6వేల నగదు దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటనపై ఆలయ కమిటీ చైర్మన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దొంగ కోసం గాలిస్తున్నట్లు ఎస్సై వివరించారు.

29న హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29న అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్స్ (ఏహెచ్‌పీఎస్) కొత్తపల్లి (హ)లో ఉమ్మడి జిల్లాస్థాయి సబ్ జూనియర్స్ గర్ల్స్ టోర్నమెంట్ కమ్ సెలెక్షన్స్ ట్రైల్స్ నిర్వహించడం జరుగుతుందని ఉమ్మడి కరీంనగర్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బాసరవేణి లక్ష్మణ్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెల 02నుంచి 04వరకు ఆసిఫాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనడం జరుగుతుందన్నారు. ఈ ఎంపిక పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌కార్డులు, డేట్‌ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ తీసుకొని ఉదయం 10 గంటలకు సంయుక్త కార్యదర్శి ఎస్. ప్రభాకర్, హ్యాండ్‌బాల్ కోచ్ మూల వెంకటేశ్, అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ పీఈటీ శ్రీధర్ కు రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. వివరాలకు 9441925807, 8978995730, 9550942180 నంబర్లను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

నకిలీ పాసుపుస్తకాలతో కాజేశారు

- రామగిరి పోస్టాఫీసులో ఘరానా మోసం
- లబోదిబోమంటూ రోడ్డెక్కిన ఖాతాదారులు



ఈచిత్రంలో కనిపిస్తున్న వాళ్లందరూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారే. కష్టపడితేనే పూగడిచేది. తాము చేస్తున్న కష్టం తమ పిల్లలు పడకూడదనే భావనతో భవిష్యత్ అవసరాలు తీర్చుకోవడానికి పోస్టాఫీస్ పథకాల్లో పొదుపు చేస్తున్నారు. వీరి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న పోస్టల్ సిబ్బంది నకిలీ పాస్‌పుస్తకాలు తయారు చేసి పొదుపు ఖాతాల్లోని డబ్బు స్వాహా చేశారు. ఈ సంఘటన రామగిరి మండలం బేగంపేట పోస్టాఫీస్‌లో చోటుచేసుకుంది. బాధితులు శుక్రవారం పోస్టాఫీస్ ఎదుట నిరసన తెలిపారు.



అధికారులు గుర్తించిన నకిలీ పాస్‌బుక్కులు

సాక్షి, పెద్దపల్లి: పోస్టాఫీసు అంటే నమ్మకానికి చిరునామా. ఏ ఉత్తరం వచ్చినా భద్రంగా అందించి విశ్వసనీయత చాటుకునే వ్యవస్థ. ఆధునిక పరిస్థితుల నేపథ్యంలో ఉత్తరాల పాత్ర అంతగా లేదు. దీంతో పోస్టాఫీసులు బ్యాంకింగ్ రంగంలోకి అడుగుపెట్టాయి. ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు (ఐపీపీబీ) పేరుతో పల్లెల్లో లావాదేవీలు జరుపుతోంది. బ్యాంకుల మాదిరిగా అన్ని నగదు లావాదేవీలు చేపడుతోంది. ఈ వ్యవహారంపై పర్యవేక్షణ, జవాబుదారీతనం లేక రామగిరి మండలం బేగంపేట పోస్టాఫీస్‌లో సిబ్బంది చేతివాటం ప్రదర్శించారు. తద్వారా బడా మోసం బయటపడింది. ఈ పోస్టాఫీసు పరిధిలో దాదాపు పదుల సంఖ్యలోని ఖాతాదారుల నుంచి సుమారు రూ.అర కోటి వరకు గోల్‌మాల్ జరిగినట్లు సమాచారం. డిపాజిట్లు, ఆర్డీల నగదును నకిలీ పాసుపుస్తకాలతో పక్కదారి పట్టించినట్లు విశ్వసనీయ సమాచారం.

బయటపడిందిలా..

బేగంపేట పోస్టాఫీస్‌కు చెందిన ఓ మహిళ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పోస్టాఫీస్‌లో ఖాతాలు తెరిచేందుకు వచ్చిన నిరాక్షరాస్యులను గుర్తించి, వారికి నకిలీ పాస్‌పుస్తకాలు అంటగట్టారు. వారి ఖాతాల్లో జమచేసిన నగదును తన సొంత అవసరాలకు వినియోగించుకున్నట్లు సమాచారం. ఇటీవల బదిలీపై వచ్చిన సబ్ పోస్ట్ మాస్టర్ శివకుమార్ పలు ఖాతాలపై అనుమానం వచ్చి తనిఖీ చేయగా విషయం మోసం బయటపడింది. దీంతో కొంతమంది ఖాతాదారులను పిలిపించి వారి పాసుపుస్తకాలు పరిశీలించగా నకిలీవిగా తేలింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించామని ఎస్‌పీఎం శివకుమార్ 'సాక్షి'కి తెలిపారు.

రెండు లక్షలు పోయాయి



మా బిడ్డ గుండ శ్రీవర్ష పేరుతో బేగంపేట పోస్టాఫీస్‌లో 2015లో ఖాతా ఓపెన్ చేశా. సుకన్య సమృద్ధి యోజన పథకం కింద అప్పటి నుంచి లావాదేవీలు కొనసాగిస్తున్న. ఇప్పటివరకు దాదాపు రూ.13,83,589 జమచేశాం. ఈరోజు పోస్టాఫీస్‌కు పోయి నిల్వ చూసుకోగా కేవలం రూ.11,60,000 మాత్రమే ఉన్నాయి. సుమారు రూ.2లక్షలు దాకా పోయాయి. మాలాంటి వారు పదుల సంఖ్యలో ఉన్నారు.

– గుండ శ్రీనివాస్, బేగంపేట

రాజన్న హుండీ లెక్కింపులో చేతివాటం

- నగదు తీసుకెళ్లే యత్నం చేస్తూ పట్టుబడిన కాంట్రాక్ట్ ఉద్యోగి
- సదరు ఉద్యోగిని విధుల్లో నుంచి తొలగించిన అధికారులు

వేములవాడఅర్బన్: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ రాజన్న ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. హుండీలో నగదు, బంగారం, వెండి కానుకలు వేసి మొక్కులు చెల్లించుకుంటారు. సంవత్సరానికి హుండీ ఆదాయం రూ.30 కోట్లు వస్తోంది. అయితే హుండీల ఆదాయం లెక్కింపును భద్రత నడుమ లెక్కిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలుపుతున్నా గురువారం జరిగిన లెక్కింపులో కాంట్రాక్ట్ ఉద్యోగి నగదు తీసుకెళ్లే ప్రయత్నాన్ని ఆలయ భద్రత సిబ్బంది గుర్తించి పట్టుకున్నారు.

నగదు కాజేసే ప్రయత్నం

ఆలయంలో గురువారం హుండీ ఆదాయం లెక్కింపు సమయంలో కాంట్రాక్ట్ ఉద్యోగ ఒకరు నగదు కాజేసే యత్నం చేశారు. ఉద్యోగి తీసుకొచ్చిన సంచిలో రూ.500 నోట్ల కట్టలు రెండు, విదేశీ కరెన్సీ కట్ట ఉంచి గుట్టు చప్పుడు కాకుండా తరలించేందుకు యత్నించడంతో ఎస్పీఎఫ్ భద్రతా సిబ్బందికి అనుమానం వచ్చి తనిఖీ చేసి పట్టుకున్నారు. దీంతో ఆ ఉద్యోగిని విధుల్లో నుంచి తొలగించారు. అయితే హుండీ లెక్కింపు సమయంలో సీసీ కెమెరాలు, ఎస్పీఎఫ్ భద్రత సిబ్బంది ఎప్పకప్పుడు తనిఖీ చేస్తున్నా నగదు తీసుకెళ్లే యత్నం చేయడం అనుమానాలకు తావిస్తోందని పలువురు అంటున్నారు.

గతంలో కూడా..



రాజన్న ఆలయంలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

రాజన్న ఆలయంలో 2019లో హుండీ లెక్కింపులో ఓ వ్యక్తి సుమారుగా 20 కిలోల సంచిలో నగదు పట్టుకెళ్లారు. హుండీ లెక్కింపు తర్వాత కోడెల క్యూ కాంప్లెక్స్‌లో బియ్యం కోసం వచ్చిన వ్యక్తి ఖాళీ సంచులు గ్రీన్ మ్యాట్ కింద సంచి కోసం వెతికిన క్రమంలో స్వామివారి కానుకల సంచి దొరికింది. ఆ కానుకల సంచిని తీసుకువెళ్లిన వ్యక్తి కరీంనగర్‌లో విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడటంతో హుండీ లెక్కింపులో ఓపెన్ స్లాబ్‌లో తనకు సంచి దొరికినట్లు పోలీసులకు చెప్పారు. ఈ వ్యవహారంలో అతడు జైలుకు వెళ్లారు.

విధుల్లో నుంచి తొలగించాం

రాజన్న ఆలయ హుండీ లెక్కింపులో కాంట్రాక్ట్ ఉద్యోగి అనుమానాస్పదంగా నగదు తీసుకువెళ్లేందుకు ప్రయత్నించగా అక్కడి ఎస్పీఎఫ్ సిబ్బంది పట్టుకున్నారు. అతడిని వెంటనే విధుల్లో నుంచి తొలగించాం. ఒక్క రూపాయి కూడా బయటకు వెళ్లలేదు..

– వినోద్‌రెడ్డి, వేములవాడ రాజన్న ఆలయ ఈవో

ఇంటికి తాళం వేస్తే అంతే..

- వరుస దొంగతనాలతో ప్రజల బెంబేలు

గంభీరావుపేట(సిరిసిల్ల): ఇంటికి తాళం వేస్తే..అంతే సంగతులు. తాళాలు పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు ఇల్లు గుల్ల చేస్తున్నారు. గంభీరావుపేట మండలంలో వరుసగా జరుగుతున్న దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇంటికి తాళం వేసి ఊరెళ్లాలంటేనే జంకుతున్నారు. దొంగతనాలు పోలీసులకు సవాల్‌గా మారాయి. కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. సీసీ కెమెరాలకు చిక్కకుండా మరీ దొంగతనాలకు పాల్పడుతున్నారు. అక్కడక్కడా సీసీ కెమెరాల్లో దొంగలు కనిపించిన ఆనవాళ్లు స్పష్టంగా లేకపోవడంతో పోలీసులకు చిక్కడం లేదు. తాళం వేసిన ఇళ్లనే కాకుండా ఆలయాలను సైతం వదలడం లేదు. నగదు, బంగారు ఆభరణాల కోసం ఇళ్లంతా చిందరవందర చేస్తున్నారు. పోలీసులు దొంగతనాల నియంత్రణకు పకడ్బందీ గస్తీలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దొంగతనం జరిగిన సంఘటనలు..

- రెండు రోజుల క్రితం మల్లారెడ్డిపేటలో తాళం వేసి ఉన్న రెండిళ్లలో చోరీ జరిగింది.
- ముస్తాఫానగర్‌కు చెందిన నారాయణరావు వ్యక్తి ఇంట్లో దొంగతనం జరిగింది. కారు సైతం ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించారు.
- గంభీరావుపేటలో నాలుగైదు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. అదేవిధంగా ఎల్లమ్మ, మహంకాళమ్మ ఆలయాల్లోనూ హుండీ డబ్బులు ఎత్తుకెళ్లారు. ఆలయంలోని సీసీ కెమెరాలకు సంబంధించిన బాక్స్ పగులగొట్టి ఫుటేజీని సైతం ఎత్తుకెళ్లారు.
- లింగన్నపేటలోని వైన్స్ షాప్‌లో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు.



దొంగలు ధ్వంసం చేసిన సీసీ ఫుటేజీ బాక్స్(ఫైల్)

ప్రత్యేక బృందాలతో పెట్రోలింగ్



వరుసగా దొంగతనాలపై ప్రత్యేక నిఘా పెట్టాం. గ్రామాల్లో పెట్రోలింగ్ చేస్తున్నాం. పోలీసులతో పాటు ఐదు ప్రత్యేక బృందాలు తిరుగుతున్నాయి. త్వరలోనే దొంగతనాలను నియంత్రిస్తాం. ఊళ్లకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలి. ప్రజలు తమ కాలనీలు, దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

– శివకుమార్, గంభీరావుపేట ఎస్సై

ముగిసిన ఉమ్మడి జిల్లాస్థాయి క్రీడా పోటీలు

- ఇష్టంతో సాధన చేస్తే గెలుపు కష్టం కాదు
- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్(మానకొండూర్): ఇష్టంతో సాధన చేస్తే గెలుపు కష్టం కాదని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహించిన 2024–25 జిల్లా స్థాయి క్రీడా పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పోటీల్లో విజేతలు సంతోషపడటం సహజమేనని, ఓడిన వారు కుంగిపోకుండా సాధనచేస్తూ గెలుపు సాధ్యమని, ఆడబోయే క్రీడల్లో విజయాలు సాధించేందుకు క్రీడోత్సవాలు పునాది కావాలన్నారు. జట్టుగా ఆడే ఆటల్లో సామూహిక ప్రతిభ ప్రదర్శించాల్సి ఉంటుందని, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకునే క్రీడలపై విద్యార్థులు ఆసక్తికనబర్చాలని కోరారు. దేశానికి పతకాలు తీసుకొచ్చిన వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని, కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందని, అందులో భాగంగానే స్పోర్ట్స్ స్కూళ్లను ప్రారంభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం విజేతలు, క్రీడోత్సవాల నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ఎంజెపి ఆర్సీవో అంజలి కుమారి ప్రిన్సిపాల్ సరిత పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విజయం సాధించిన క్రీడాకారులతో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

అక్రమ పట్టాలపై విచారణ

చందుర్తి(వేములవాడ): అక్రమ పట్టాలపై రెవెన్యూ అధికారులు విచారణ చర్యలు చేపట్టారు. అక్రమాలకు పాల్పడ్డ అధికారులపై చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ ఉన్నతాధికారులు చేష్టలుడిగి చూస్తున్నారన్న ఆరోపణలు మండల కేంద్రంలో జోరుగా వినవస్తున్నాయి. తప్పుడు పట్టాలు చేసిన అధికారులను గుర్తించి చర్యలు చేపట్టాల్సిన అధికార యంత్రాంగం కిందిస్థాయి అధికారులను కాపాడుకునేందుకు దిద్దుబాటు చర్యలు చేపట్టారన్న ఆరోపణలున్నాయి. అక్రమ పట్టాల్లో ఒక్క తహసీల్దార్ నరేశ్ కాకుండా.. ఇతర అధికారులు కూడా ఉన్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

ఉన్నతాధికారులు రంగంలోకి దిగితేనే..

అక్రమ పట్టాలపై జిల్లా ఉన్నతాధికారులు రంగంలోకి దిగి విచారణ చేపడితే ఎవరు అక్రమాలకు పాల్పడ్డారో బయట పడుతుంది. అక్రమ రిజిస్ట్రేషన్ చేశాడన్న ఫిర్యాదు మేరకు తహసీల్దార్ నరేశ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించగానే.. మండలంలోని అన్ని అక్రమాలన్నింటికీ అతనే బాధ్యుడన్న కోణంలో చూసే ఉన్నతాధికారులు, ప్రస్తుతం ఉన్న అధికారులు కూడా పైరవీకారులను ఏర్పాటు చేసుకొని మరికొన్ని అక్రమాలకు పాల్పడ్డారన్న ఆధారాలు ప్రజలు బయట పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.

సర్వేయర్, ఆర్‌ఐ విచారణ

బండపల్లి గ్రామ శివారులోని 591 సర్వే నంబర్‌లో 2.37 ఎకరాల వ్యవసాయ భూమిని గతంలో ఉన్న తహసీల్దార్ అక్రమ పట్టా చేశారన్న ఆరోపణలుండగా.. అదే సమయంలో ఆ భూమి గ్రామ కంఠంగా తప్పుడు నమోదు చేశారు. గ్రామ కంఠంను తొలగించేందుకు పట్టాదారుడు మీసేవలో దరఖాస్తు చేసుకోగా.. ప్రస్తుతం ఉన్న తహసీల్దార్ గ్రామ కంఠాన్ని తొలగించేందుకు ఆర్డీవోకు నివేదిక పంపించారు. ఆర్డీవో వద్ద పెండింగ్ ఉన్న సమయంలోనే అక్రమాల విషయం బయట పడడంతో.. అక్కడికే నిలిపివేశారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. శుక్రవారం డిప్యూటీ సర్వేయర్ చామంతి, ఆర్‌ఐ శ్రీనివాస్ విచారణ చేపట్టారు.

చర్యలు తీసుకుంటాం



అక్రమ పట్టాలపై సమగ్ర విచారణ చేపడుతున్నాం. పట్టాలు ఎలా చేశారు.. ఎవరు చేశారన్న విచారణ పూర్తి చేస్తే కానీ అసలు విషయాలు బయటపడేలా లేవు. విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తాం. చర్యలు తీసుకోవడం, దిద్దుబాటు చర్యలు చేపట్టడం ఉన్నతాధికారుల చేతుల్లో ఉంది.

– సీహెచ్ శ్రీనివాస్, తహసీల్దార్, చందుర్తి

ఎదురెదురుగా బైక్‌లు ఢీకొని ఇద్దరు మృతి

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): మెట్‌పల్లి మండలం వెల్లుల శివారులో శుక్రవారం ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని మండలంలోని బండలింగాపూర్‌కు చెందిన పోతుగంటి శ్రీనివాస్‌గౌడ్(50), వెల్లులకు చెందిన దగ్గుల స్వామి(42) మృతిచెందారు. పోలీసుల వివరాలు.. గీత కార్మికుడైన శ్రీనివాస్ తన అక్క కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై ఓ ఫంక్షన్‌కు వెళ్లాడు. మధ్యాహ్నం తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఇదే సమయంలో వెల్లుల వైపు నుంచి మెట్‌పల్లిలో నివాసం ఉంటున్న మత్స్యకారుడు స్వామి ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో అతివేగంగా వచ్చిన వాహనాలు ఎల్లమ్మ ఆలయ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈప్రమాదంలో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందగా, స్వామి ఆసుపత్రికి తరలిస్తుండగా చనిపోయాడు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహాలను మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

జగిత్యాలలో ఒకరు..

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన ఏనుగు మనోజ్‌కుమార్ (63) రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై చికిత్స పొందుతూ మృతిచెందాడు. శుక్రవారం ఉదయం మనోజ్‌కుమార్ ద్విచక్ర వాహనంపై గొల్లపల్లి రోడ్‌లో వెళ్తుండగా తుమ్మనపల్లి ప్రవీణ్ బైక్‌పై అతివేగంగా వచ్చి ఢీకొట్టాడు. మనోజ్‌కుమార్‌కు తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి మామ గన్నమనేని కరుణాకర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై మన్మధ రావు తెలిపారు.



ప్రమాద స్థలం



శ్రీనివాస్(ఫైల్)



స్వామి(ఫైల్)

ఆన్‌లైన్ మోసం.. ఇద్దరి అరెస్టు

- ట్రాన్సిట్ వారెంట్‌పై తీసుకొచ్చిన స్థానిక పోలీసులు

కరీంనగర్‌క్రైం: ఆన్‌లైన్ పెట్టుబడుల పేరుతో కరీంనగర్ జ్యోతినగర్‌కు చెందిన వ్యక్తిని మోసం చేసిన ఇద్దరు నిందితులను అహ్మదాబాద్‌లో అరెస్టు చేసిన కరీంనగర్ సైబర్‌క్రైం పోలీసులు శుక్రవారం స్థానిక కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు. వారి వివరాల ప్రకారం.. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన అహ్మద్‌ఖాన్, సర్ఖేజ్‌కు చెందిన షేక్ అఫ్తాబ్(24), దివాన్ మురద్‌షా(34)కలిసి ముఠాగా ఏర్పడ్డారు. మిగితా ఇద్దరిపై అహ్మదాబాద్ భోపాల్‌లోని ఇండస్ ఇండ్ బ్యాంక్‌లో ఖాతాలు తెరిపించి అహ్మద్‌ఖాన్ వాటిని నిర్వహిస్తున్నాడు. కరీంనగర్‌లోని జ్యోతినగర్‌కు చెందిన పచ్చునూరి సురేందర్ సెల్‌ఫోన్‌కు వాట్సాప్, టెలిగ్రాంలో అహ్మద్‌ఖాన్ సందేశాలు పంపించాడు. బంగారం, ఎక్స్ఆర్‌పీలో పెట్టుబడిపెడితే లాభాలుంటాయని నమ్మించాడు. దీంతో బాధితుడు రూ.33,63,000 అహ్మద్‌ఖాన్‌కు బదిలీ చేశాడు. అప్పటి నుంచి స్పందన లేకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు కరీంనగర్ సైబర్‌క్రైం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితులైన షేక్‌అఫ్తాబ్, దివాన్ మురాద్‌షాను అహ్మద్‌బాద్‌లో బుధవారం అరెస్టు చేశారు. అక్కడి కోర్టులో ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తీసుకొచ్చి శుక్రవారం కోర్టులో హాజరుపరిచి రిమాండ్ చేశారు. త్వరలోనే ప్రధాన నిందితుడు అహ్మద్‌ఖాన్‌ను అరెస్టు చేస్తామని సైబర్‌క్రైం స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఏసీపీ నరసింహారెడ్డి వెల్లడించారు.


గుండెపోటుతో సర్పంచ్ భర్త మృతి

ధర్మపురి: తాజామాజీ సర్పంచ్ భర్త, మాజీ ఎంపీటీసీ బోర్లకుంట రాజయ్య (48) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందాడు. మండలంలోని ఆరెపెల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బోర్లకుంట కమల భర్త రాజయ్య ఇంటిలో పనులు చేస్తుండగా గుండెపోటుకు గురయ్యాడు. మృతుడికి ఇద్దరు కుమారులుండగా గతంలో ఒక కుమారుడు మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దినేశ్, నాయకులు పరామర్శించారు.



రాజయ్య (ఫైల్)

ముగిసిన కార్మిక సంఘాల శిక్షణ



గోదావరిఖని: మూడురోజుల పాటు హైదరాబాద్‌లో గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాల నాయకులకు నిర్వహించిన శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సింగరేణి సంస్థ సీఎండీ బలరాం హాజరై ప్రసంగించారు. సంస్థ అభివృద్ధిలో కార్మిక సంఘాల పాత్ర కీలకమన్నారు. సంస్థను అగ్రగామిగా నిలిపేందుకు నిర్మాణాత్మక పాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, కార్మిక సంఘాల నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్, జనక్‌ప్రసాద్, ఎల్.ప్రకాశ్, వైవీ రావు, మడ్డి ఎల్లాగౌడ్, కందికట్ల వీరభద్రం, వంగ వెంకట్, ఆరెల్లి పోశం, జీగురు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన దంపతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన గుమ్మడిదారి రాజేశం, అనసూర్య దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. కొద్దిరోజులుగా రాజేశం కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో రాజేశంతో పాటు అతడి భార్య అనసూయ శుక్రవారం ఉదయం పురుగుల మందు తాగడంతో గమనించిన స్థానికులు చికిత్స కోసం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ ఘటనపై పోలీసులను సంప్రదించగా.. తమకు సమాచారం లేదని పేర్కొన్నారు.

ముఖంపై గాయాలకు ప్రత్యేక శస్త్రచికిత్స

కోల్‌సిటీ(రామగుండం): ఓ యువకుడి ముఖంపై తగిలిన తీవ్రగాయాలకు గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) వైద్యులు కఠినతరమైన ఆపరేషన్ చేసి శభాష్ అనిపించుకున్నారు. ఈ తరహా శస్త్ర చికిత్స చేయడం జీజీహెచ్‌లో ఇదే తొలిసారి కావడం గమనార్హం. జంగ సంజయ్ అనే యువకుడు ఇటీవల బైక్‌పై నుంచి పడిపోగా.. ముఖ్యంపై తీవ్రగాయాలయ్యాయి. ఆ గాయాలు నయం కావడానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురవడంతో ఇటీవల జీజీహెచ్‌లో చేరాడు. పరీక్షించిన దంత వైద్య విభాగం నిపుణులు.. ఆ యువకుడికి శస్త్ర చేయడానికి నిర్ణయించారు. నిపుణుల ఆధ్వర్యంలో ముఖంపై ఎడమ ఆర్బిటల్ ఫ్లోర్, రిమ్, ఎడమ జైకోమటిక్ – మెక్సిల్లరీ ఎముకలకు ఉన్న పగుళ్లను ఓపెన్ రిడక్షన్ – ఇంటర్నల్ ఫిక్సషన్ (ఒరిఫ్)తోపాటు మ్యాక్సీల్లో మాండ్యబుల్ ఫిక్సషన్ (ఎంఎంఎఫ్) అనే కఠినమైన మినీ ఇంప్లాంట్లలను కుదుర్చుతూ శస్త్ర చికిత్స నిర్వహించారు. అనంతరం పేషెంట్ కంటిచూపు, చెవి, ముక్కు, గొంతు కదలికలన్నీ సక్రమంగా ఉన్నాయని, వేగంగా కొలుకుంటున్నాడని వైద్యులు వెల్లడించారు. ఇలాంటి ఆర్బిటాల్ ఎక్స్‌ప్లోరేషన్ – ఆర్బిటాల్ ఫ్రాక్చర్ల శస్త్రచికిత్సలను ఇప్పటి వరకు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలోనే చేస్తున్నారని పేర్కొన్నారు. తొలిసారి గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిర్వహించటం విశేషమని వివరించారు. దంత వైద్యులు, అనెస్తీషియా బృందాన్ని సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్ అభినందించారు. పేషెంట్ సంజయ్ సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.



కోలుకున్న పేషెంట్ సంజయ్